## ఊహించండి!

హాబీలు అనేక రకాలు. కొందరికి స్టాంపులను సేకరించడం ఇష్టం. కొందరికి రకరకాల ఖాళీ అగ్గి పెట్టెలను, సిగరెట్ పెట్టెలను సంపాదించి దాచుకోవడం ఇష్టం. సుప్రసిద్ధ క్రికెట్ క్రీడాకారులు ఏ టెస్టులో ఎన్ని రన్లు చేశారో లెక్కలు తయారు చేయడం ఇప్పటి యువతరంలో చాలా మందికి ఇష్టం. సినీతారల బొమ్మలను సేకరించి ఆల్బమ్స్ తయారుచేయడం కూడా ఒక హాబీయే.

కొన్ని హాబీలు విజ్ఞానాన్ని పెంపొందిస్తాయి. మేధను వికసింప జేస్తాయి. నిత్యజీవితంలోనూ అవి ఉపయోగిస్తాయి. ఆర్థికంగా లాభించే హాబీలు కూడా ఉన్నాయి.

హాబీలు పెంచుకొంటున్న వారు యువతీ యువకులలోనే ఎక్కువ. పది పన్నెండేళ్ళ వయస్సు నుంచి హాబీలను అలవరుచుకోవడం ప్రయోజనకరం. కాని, ఎవరికైనా, ఏ వయస్సులోనైనా హాబీలు ఏర్పడే అవకాశం ఉంది.

యువతరం మేధాశక్తినీ, విజ్ఞాన సంపదనూ పెంచడం కోసం హాబీలను ప్రోత్సహించడం కొన్ని దేశాలలో సరికొత్త పరిణామం.

విజ్ఞాన తృష్ణ కలిగిన యువతీ యువకుల కోసం 'ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక' త్వరలో ఒక కొత్త శీర్షిక ప్రారంభిస్తున్నది. మీ రొక కొత్త హాబీని పెంపొందించుకోవడానికి ఈ శీర్షిక తోడ్పడుతుంది. ఇందులో విజ్ఞానమే కాదు-వినోదం ఉంది, థ్రిల్ కూడా ఉంది.

పెట్టుబడి మీ జిజ్ఞాస మాత్రమే!

ఉదయాస్తమయాల వింత కాంతులకు, హరివిల్లు రంగులకు, తారకల మిలమిలలకు, ప్రకృతి సోయగాలకు స్పందించే హృదయం మీకు ఉంది కనుక ఈ సరికొత్త శీర్షిక మీదే.

అదేమిటో ఊహించడానికి ప్రయత్నించి వచ్చే వారం మేము వేసే ప్రకటనతో పోల్చి చూడండి.

- ఎడిటర్

## చరిత్రకందని చిత్రకథ

# నూర్జహాన్

డాక్టర్ లత

"**నూర్జహాన్!** సలాం అలేకుం!!"

"వా లేకుం సలాం. నేను మెహర్‌ను. భర్తృవిహీనను... భర్తృ హంతకుని చేతిలో పడ్డాను" అంది జనన్మోహిని నూర్జహాన్ మండిపడుతూ.

జహాంగీరు తన పాన పాత్ర కిందపెట్టి—"అనార్కలీ!" అన్నాడు.

"కాదు. చచ్చిపోయింది. నేను మెహర్‌ని."

"అది తెలియని వారికీ, చరిత్రకారులకీ! కాని, అనార్! ఈనాడు మా తండ్రి... నేనే భగవంతుడినని ప్రచారం చేసి అందరి చేతా అల్లాహో అక్బర్ అనిపించి కనీస మానవత్వం కొడుకు మీద చూపించని మా తండ్రి లేడు. అఖండ హిందూస్తాన్‌కి నీవు పాదుషా బేగంవి! భయపడకు, అనార్, భయపడకు."

"దయా దాక్షిణ్య రహితమైన ఈ రాజరికం నాకు వద్దు. ఆ రోజున నన్ను మధ్య పెట్టి సమాధి కట్టిన ఆ తండ్రి కొడుకువి నువ్వు."

"అంతే కాదు. అడుగు నించి సొరంగం తవ్వించి నిన్ను రక్షించిన అనార్కలీ ప్రియుడు షహజాదా సలీముని కూడా! పిచ్చి ఆలోచనలు మాను, అనార్."

"కాదు—మెహర్."

"అచ్చా మెహర్‌కే నామ్‌కే వాస్తే — కాని, పాదుషా బేగంకి ఒక మనవి. నిన్ను ప్రేమించిన సలీముని నీవు మర్చిపోయావా? నీ కోసం ఆరాటించి, అలమటించి ప్రాణం మీదకు తెచ్చుకున్న ఆ సలీముని నీవు మర్చి పోయినావా? చక్రవర్తి నీ వివాహం జరిపించిన అనంతరం అనేక తడవలు బిచ్చగాడుగా వంగ రాష్ట్రాధిపతి భవనం ముందు... నీవు రొట్టెలు వేయడం కోసం ఎండలో, వానలో, చలిలో వరసతో దీనుడిగా నిలబడ్డ ఈ రాజకుమారుడిని — ఈ భవిష్యత్ చక్రవర్తిని—నీవు చూసి గర్వంతో చిరునవ్వు నవ్వలేదా? ఆ నవ్వు వల్లనే నేను నిన్ను పాదుషా బేగం చేశాను. ఇక నీ భర్తను హత్య చేసింది నేను కాదు. మహమ్మదీయ న్యాయ ప్రకారం నిన్ను వివాహం చేసుకొన్నాను. అప్పుడైనా... కనీసం అప్పుడైనా పూజనీయులైన మవుల్వీలు నిన్ను ఈ వివాహం నీ కిష్టమా? కాదా? అని అడిగినప్పుడు—కాదని ఎందుకు చెప్పలేదు?" రౌద్రంగా అడిగాడు జహాంగీర్.

"నా కుమార్తెను కూడా చంపిస్తావనే భయంతో" అంది మెహర్ పెంకెగా.

"అనార్! నీవు ఆ నాటి దానిమ్మ పువ్వులాటి దానివి కావు. ముళ్ళ గులాబీగా మారావు... ఆ పసి పిల్లను చంపిస్తాననుకొన్నావా? సలీం అంతటి నీచుడుగా నీ కెప్పటి నుంచి కనిపిస్తున్నాడు? ఆ రోజు ప్రాణాలు పోయే స్థితిలో సమాధిలోంచి నిన్ను తప్పించి, ప్రాణాలకు తెగించి నిన్ను భుజాన వేసుకొని ఈ మొగలాయీ దర్బార్ నుంచి తప్పించిన నీ ప్రియుడు నీకు నీ బిడ్డను చంపించే హంతకుడుగా కనిపిస్తున్నాడా? ఆగ్రా కోటలో మరియమ్ బేగం మహలులో నిన్ను రహస్యంగా దాచి నాలుగు నెలలు కాపాడిన సలీం నేడు నీకు హంతకుడుగా ఎట్లా కనపడుతున్నాడు? ఉన్నతుడుగా ఎందుకు కనిపించలేదు? అది నీ దృష్టి లోపమా? నా అదృష్ట దోషమా? అనార్! ఆడమనసు అమృతం అనుకున్నాను. బిచ్చగాడుగా నీ ఇంటి ముందు నిలబడినప్పుడు నీవు నవ్వితే అది ఆప్యాయత అనుకున్నాను గాని, అపహాస్యం అనుకోలేదు, అనార్! అది నా లోపం అని నీవు అనవచ్చును. ఇంతవరకూ అన్నీ నా లోపాలే కాని, నా కోసం నీవు ఏమీ ఎరగవు. నిజంగా నిన్ను ప్రేమించడం తప్పయితే, అదొక్కటే నా లోపం. నా తొలివలపు విరివలపులాగా నిన్నాకరించినప్పుడు అది తప్పని నీవు నా కెందుకు చెప్పలేదు? నీ కోసం రాజదర్బారులో అక్బర్ చక్రవర్తినీ, అబుల్ ఫజల్‌నీ ఎదిరించినప్పుడు అది తప్పని నీవు నా కెందుకు చెప్పలేదు? జీవితం నన్ను చూసి నవ్వినప్పుడు నీవు హాయిగా పెళ్ళి కూతురుగా వెళ్ళి పోయావు గాని, అది తప్పని నా కెందుకు చెప్పలేదు? తప్పు నీది కాదంటావా, పాదుషా బేగం?" అన్నాడు జహాంగీరు, పానపాత్రలో మధువు ఒంపుకుంటూ.

"పాదుషా బేగం..." గొణిగింది నూర్జహాన్.

"అవును, పాదుషా బేగం! తొలి యౌవనంలో నన్ను ఆరాధించిన అనార్! నీవు పాదుషా బేగంవి. మలి యౌవనంలో మెహర్‌గా ఈ ఫకీర్‌ని చూసి నవ్విన మెహర్! నీవు పాదుషా బేగంవి



ప్రౌఢ వయస్సులో సన్నివిధంగా నిలబెట్టిన నూర్జహాన్! నీవు పాదుషా బేగంవి. నీకు ఈ హిందూస్థాన్ మీదా, నా మీదా అన్ని అధికారాలూ ఉన్నాయి. మెహర్! నే నిప్పుడు దానిమ్మ మొగ్గం కన్న, పచ్చాని పుష్పాల కన్న ముళ్ళ గులాబీల్ని ప్రేమిస్తున్నాను. కనక, నూర్జహాన్, నీవు పాదుషా బేగంవి."

"నేను... నేను... అనార్‌ని కాదా?"

"కాదు. చరిత్రకారుల దృష్టిలో ఆ అనార్ ఏనాడో చచ్చిపోయింది."

"మెహర్ని కూడా కాదా?"

"కొంతవరకు. కాని, మెహర్‌వి కూడా కాదు."

"మరెవర్ని?"

"నూర హాన్... పాదుషా బేగంవి."

"సలీం... యా ఖుదా."

"నూర్జహాన్! నీవు జహంగీరు అర్ధాంగివి. అఖండమైన దేశానికి రాణివి."

"షహజాదా! యా అల్లా!"




"నూర్జహాన్! నీవు వంగరాష్ట్ర పాలకుడి పెళ్ళానివి కాదు. జహంగీరు పాదుషా ప్రాణానికి ప్రాణానివి!"

"జ...హాం...గీర్!"

"నూర్జహాన్! ఇదరావ్. దిల్ కీ మంజిల్ వేందీన్ జలావ్ నూర్జహాన్ పాదుషా బేగం ధన్యజీవి. మెహర్! నూర్జహాన్ ఒకరని అందరికీ తెలుసు. అనార్కలీవి, నువ్వని ఎవరూ అనరు. ఇది చరిత్ర కందని చిత్ర కథ" అన్నాడు జహంగీర్, నూర్జహాన్‌కి రాజ ముద్ర ఇచ్చి ముద్దు చేస్తూ. ★